క్లుప్తంగా

జీడిపంటకు వాతావరణ ఆధారిత బీమా

పూసపాటిరేగ: జీడి పంటకు వాతావరణ ఆధారిత బీమా కల్పిస్తున్నట్లు భోగాపురం ఉద్యానవనశాఖ అధికారి జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడిపంట సాగు చేసిన రైతులు ఎకరానికి 1500 రూపాయలు చెల్లించి, బీమా చేసుకోవాలని పేర్కొన్నారు. వన్‌బీ, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, పంట సాగు పత్రం వివరాలతో ఈ నెల 15వ తేదీ లోపు సీఎస్‌పీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జీడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 6వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ రమాదేవి

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలను అరికట్టాలని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కిల్లాడ రమాదేవి, కేస్ వర్కర్ రొంగలి వెంకటలక్ష్మి తెలిపారు. మలిచర్ల హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా చైల్డ్‌లైన్ 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: ఈ నెల 28న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం. సురేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పాల్గొనాలనుకున్న అభ్యర్థులు వారి నామినేషన్ పత్రాలను విజయనగరం కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారైన సంయుక్త కలెక్టర్ లేదా జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓకు అందజేయాలన్నారు. ఈ నెల 12న నామినేషన్లు పరిశీలన, 14వ తేదీ సాయంత్రం మూడు గంటల్లోపు ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు.

నియామకం

నెల్లిమర్ల : పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు గంటా సత్యనారాయణ (సతీష్) కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అమరావతిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు పాలకవర్మ, డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్, జిల్లా ఇన్‌చార్జ్ ఉమా శంకర్, పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు సత్యనారాయణను అభినందించారు.

పాడి రైతులను పట్టించుకోండి

శృంగవరపుకోట: ప్రభుత్వం పాడిరైతులను ఆదుకోవాలని, వారి జీవన ప్రమాణాలు పెంచే యోచన చేయాలని పలు కార్మిక, కర్షక సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో ఏపీ పాడిరైతుల సంఘం ఆధ్వ ర్యంలో లోకవరపు నారాయణ అధ్యక్షతన సోమవారం రౌండ్‌టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర నుంచి 3,50,000 మంది పాడి రైతులు విశాఖ డెయిరీకి పాలుపోస్తున్నారని, వారి కష్టంతో ఎదిగిన డెయిరీ సహకార రంగం నుంచి కంపెనీల చట్టంలోకి మారి, ఆస్తులను అన్యాక్రాంతం చేస్తోందన్నారు. నష్టాలపేరుతో పాల ధర తగ్గించి రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. లీటర్‌కి రూ.2.60 నుంచి రూ.4 వరకూ తగ్గించారని, రైతుకు చెల్లించే ధరకు, డెయిరీ వినియోగదారుడికి విక్రయించే ధరకు వ్యత్యాసం రూ.20 ఉందన్నారు. పాలధరను వెంటనే పెంచాలని, డెయిరీ లాభాల నుంచి ప్రతీ నాలుగు నెలలకొకసారి బోనస్ ఇవ్వాలని, డెయిరీ ఆస్తులను వెనక్కి తేవాలని కోరారు. ఆవుపాలకు లీటర్‌కి రూ.50, గేదెపాలకు రూ.80 చెల్లించాలని, దాణా ఖర్చులో 75శాతం రాయితీ ఇవ్వాలని, బీమా ప్రీమియం కంపెనీలు భరించా లంటూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంపా కృష్ణమూర్తి పెట్టిన తీర్మానాన్ని అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

హరహర మహాదేవ..

కార్తీకమాస మొదటి సోమవారం శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. స్వామి దర్శనానికి వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. మహిళా భక్తులు కార్తీక స్నానాలాచరించి నదులు, చెరువుల్లో తెప్ప దీపాలు వదిలారు. అనంతరం స్వామిని దర్శించుకుని ఆలయ ఆవరణలో గల నంది, తులసి కోట, రావి, మర్రి చెట్ల వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలకు పూజలు చేస్తున భక్తులు



భోగాపురం: మండల కేంద్రంలోని శివాలయంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



విజయనగరం టౌన్: అయ్యకోనేరు దక్షిణ గట్టులోని ఉమా మహేశ్వరాలయంలో మహాశివునికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు సందీప్‌శర్మ



విజయనగరం టౌన్: రింగురోడ్డు సింహాద్రినగర్‌లోని సాయిబాబా ఆలయంలో కొలువైన వైద్యనాథ లింగానికి పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం రూరల్: ద్వారపూడి శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



విజయనగరం రూరల్: దుప్పాడ ఆలయంలో నవగ్రహాలకు పూజలు చేస్తున్న మహిళలు



నెల్లిమర్ల రూరల్: ప్రత్యేక అలంకరణలో రామతీర్థం ఉమాసదాశివస్వామి



విజయనగరం ఫొటోగ్రాఫర్: ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం ఫొటోగ్రాఫర్: పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలి..

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ నిర్దేశించిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు అందరూ ఐకమత్యంతో పనిచేయాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మోపాడలోని తన స్వగృహంలో డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ తరఫున నిలబెట్టే వ్యక్తిని గెలిపించేందుకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు కృషి చేయాలని కోరారు. జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బలం వైఎస్సార్‌సీపీకే అత్యధికంగా ఉన్న నేపథ్యంలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భాను, రొంగలి కనకసింహాచలం, రావాడ బాబు, పడాల శ్రీను, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం..

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



కాలువల్లో పూడికలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య, తదితరులు

విజయనగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ట్యాంక్‌బండ్ రోడ్డు వద్దనున్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన చిరు వ్యాపారులను మందలించారు. అలాగే ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ప్రధాన కాలువను శుభ్రం చేయాలని పారిశుధ్య పర్యవేక్షకులను ఆదేశించారు. అనంతరం పూల్‌బాగ్ చేరుకున్న ఆయన పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రహదారులకు ఇరువైపులా చెట్లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే కాలువలను శుభ్రం చేయాలన్నారు.

పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలి..

- జిల్లా పశువైద్యాధికారి వైవీ రమణ



డెంకాడలో పశుగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి వైవీ రమణ, తదితరులు

డెంకాడ: రైతులందరూ తమ పశువుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వైవీ రమణ అన్నారు. 21వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని డెంకాడ గ్రామంలో ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైవీ రమణ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందన్నారు. ఐదేళ్లకు ఒకసారి నాలుగు నెలల పాటు ఈ కార్యక్రమం చేపడతామని.. రైతులు, పెంపకందారులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భోగాపురం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు మహాపాత్రో, పశువైద్యాధికారి కె.సంతోష్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



రామారావును సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

పూసపాటిరేగ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటిండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన గిడుతూరి రామారావును సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

– ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైమ్: జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికను సజావుగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి కచ్చితంగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు హాజరుకావద్దని సూచించారు. ఎన్నికల సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలకు వినియోగించే లౌడ్‌స్పీకర్లకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ అధికారుల సహకారంతో తొలగించాలన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అతిక్రమించిన వారిపై దాడులు నిర్వహించేందుకు ఇప్పటికే ప్రత్యేకంగా ఎంసీసీ టీమ్‌లను, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. లైసెన్స్‌డ్ తుపాకులను డిపాజిట్ చేయాలని ఆదేశించారు.

బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు..



గ్రామాల్లో వేలంపాటలు నిర్వహించి బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎ.సన్యాసినాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లైసెన్స్‌డ్ మద్యంషాపుల యజమానులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకే దుకాణాలు నిర్వహించాలని సూచించారు.

– డెంకాడ

దోమల నిర్మూలనకు ఫాగింగ్ ..



విజయనగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమల నిర్మూలనకు ప్రజారోగ్య సిబ్బంది ఫాగింగ్ చర్యలను ముమ్మరం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం డివిజన్ల వారీగా ఫాగింగ్ చేపడుతున్నారు. కాలువలు, చెరువులు, కుంటలలో కూడా స్ప్రేయింగ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య పిలుపునిచ్చారు.

– విజయనగరం

పక్కాగా ఎన్నికల కోడ్..



ఈ నెల 28న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ ఎం. సురేష్ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల కోడ్‌పై అనుసరించాల్సిన విధి విధానాలపై వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మండలంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తీసివేయాలని ఆదేశించారు. అలాగే నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విమ్రాన్, డీటీ సుబాష్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

– భోగాపురం

పెండింగ్ జీతాలు ఇప్పించండి..



పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద 108 ఉద్యోగులు.. ఘోషాస్పత్రి వద్ద తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజుల తరబడి నిరసన తెలుపుతున్నా మా ఆకలి బాధలు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో సతీష్‌కుమార్, శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

గ్రామసభ..



నెల్లిమర్ల మండలంలోని చంద్రంపేటలో ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీడి రైతులు ఎకరానికి రూ.1500 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట పోతే ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరవుతుందని చెప్పారు. వన్‌బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా, పంటసాగు పత్రాలను తీసుకొని సీఎస్సీలోని ఆన్‌లైన్ పోర్టల్ ఈ నెల 15లోపు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

ఓటరు జాబితా విడుదల..



విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నెల్లిమర్ల నగర పంచాయతీలో ఓటర్లు జాబితా వివరాలను కమిషనర్ కె. అప్పలరాజు సోమవారం విడుదల చేశారు. నగర పంచాయతీలో ఎక్స్ అఫీసియో మెంబర్ అయిన ఎమ్మెల్యే, 20 మంది వార్డు కౌన్సిలర్‌లతో కలిపి మొత్తం 21 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓటరు జాబితాను కార్యాలయం నోటీసు బోర్డులో వేలాడదీశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల